క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే వివేకానంద్ పర్యటించనున్నారు. ప్రగతియాత్రలో భాగంగా ఉదయం 7.30 గంటలకు మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌లతో కలిసి 13వ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల పావని పాల్గొననున్నారని బీఆర్‌ఎస్ శ్రేణులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని మేయర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీలో 13 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. రోజుల తరబడి జ్వరం, దగ్గు, గొంతు నొప్పి తదితర లక్షణాలుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకుని చికిత్స చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు

మియాపూర్: మియాపూర్‌లోని గ్రేట్ ఆనాథాశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ మూర్తి ప్రేమ వేల కట్టలేదని, నవమాసాలు కని పెంచి జన్మనిచ్చిన మాతృమూర్తి నిస్వార్థమైనదని పేర్కొన్నారు. తల్లిని మించిన దైవం లేదన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ జనార్ధన్, సభ్యులు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

నిజాంపేట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు.

క్రికెట్ శిక్షణ కేంద్రం ప్రారంభం..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లోని సింహపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ శిక్షణా కేంద్రాన్ని శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ బ్యాట్‌ను ఝుళిపిస్తూ కొద్దిసేపు ఆయన సందడి చేశారు. క్రీడాకారులను అన్ని విధాలుగా తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు బెంబడి బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, విజయ్‌రామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవిరెడ్డి, రామ్‌కుమార్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి ఉద్యోగం రాలేదని ఉరేసుకుని ఆత్మహత్య

జీడిమెట్ల: మంచి ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ తెల్పిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా అరుంధతి నగర్‌కు చెందిన బాలరమేష్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బాల అఖిల్ (25) కుత్బుల్లాపూర్ చింతల్‌లోని బంధువుల ఇంట్లో ఉంటూ మెడికల్ బిల్లింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఉందని చెప్పి గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. ఎంతకూ గదిలోంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి తలుపు తట్టగా ఎంతకూ తలుపులు తీయలేదు. దీంతో తలుపులు తెరచి చూడగా ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతుడి తండ్రి బాలరమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృథాగా నీరు.. అయినా పట్టించుకోరు!

- జలమండలి అధికారుల నిర్లక్ష్యం
- నెలరోజులుగా రోడ్డుపాలవుతున్న తాగునీరు

రంగారెడ్డినగర్: జలమండలి అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రధాన పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ కారణంగా నెల రోజులుగా నీరు వృథాగా పోతోంది. కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్ పరిధిలోని తాగునీటి పైపులైన్ల నిర్వహణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏ ప్రాంతంలో చూసినా పైపులైన్ల లీకేజీల పరంపరం కొనసాగుతూ వస్తోంది. ప్రతి నెలా పైపులైన్ల నిర్వహణకు లక్షలాది నిధులు వెచ్చిస్తున్నట్లుగా జలమండలి అధికారులు లెక్కల్లో చూపుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

◆ షాపూర్‌నగర్ జలమండలి సబ్ డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులోని సాగర్ హోటల్‌కు ఎదురుగా నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో చింతల్‌కు వెళ్లేవైపు నాలా గుండా వెళ్తున్న 600 ఎంఎం పైపులైన్‌కు నెల రోజులుగా లీకేజీ ఏర్పడిన విషయాన్ని జలమండలి అధికారులు గాని, సిబ్బంది గాని గుర్తించడం లేదు. దీంతో ప్రతి నిత్యం ఈ పైపులైన్ నుంచి లీకవుతున్న గోదావరి జలాలు నేరుగా నాలాలోకి వృథాగా పోతున్నాయి. పైపులైన్ నుంచి నీరు పైకి ఎగజిమ్మడంతో స్థానికంగా ఉండే కొందరు పైపులైన్‌పై అట్టను ఏర్పాటు చేశారు. షాపూర్‌నగర్ జలమండలి సబ్ డివిజన్ కార్యాలయానికి సమీపంలో అదీ ప్రధాన రహదారి



నీళ్లు పైకి ఎగజిమ్మకుండా పైపులైన్‌పై అట్టాను పెట్టిన దృశ్యం

పక్కనే ఈ లీకేజీ తలెత్తినా అధికారులు, సిబ్బంది కళ్లకు కనిపించకపోవడం గమనార్హం.

పైపులైన్ నిర్వహణ గాలికొదిలి..

షాపూర్‌నగర్ నాలా గుండా వెళ్తున్న పైపులైన్ నిర్వహణను జలమండలి అధికారులు గాలికొదిలేశారు. ఈ పైపులైన్ ద్వారా పలు కాలనీలు, బస్తీలకు తాగునీరు సరఫరా అవుతోంది. భూమిలో నుంచి వెళ్లే పైపులైన్‌లు పలు చోట్ల నాలా ప్రాంతాల గుండా వెళ్తున్నాయి. ఆ ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పైపులు తుప్పు పట్టి చిల్లు పడుతున్నాయి. ప్రతి సంవత్సరం పైపులైన్ల నిర్వహణకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్న వాటికి పెయింటింగ్ వేయించిన పాపాన పోవడం లేదు.



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో నాలా మీదుగా వెళ్తున్న 600ఎంఎం పైపులైన్‌కు తలెత్తిన లీకేజీ



హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి, చెరుకుపల్లి భరతసింహారెడ్డి

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. హనుమాన్, రామాలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. – కుత్బుల్లాపూర్



వేణుగోపాలస్వామి ఆలయంలో కేఎం ప్రతాప్‌ను సత్కరిస్తున్న హనుమాన్ భక్తమండలి సభ్యులు



నిజాంపేట్‌లోని శ్రీసీతారామాంజనేయ ఆలయంలో పూజల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆలయాల సందర్శన.. మనసుకు ప్రశాంతత



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు అద్దంకి దయాకర్, భూపతిరెడ్డి

సుభాష్‌నగర్: ఆలయాల సందర్శన మనసుకు ప్రశాంతత చేకూరుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అద్దంకి దయాకర్, నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. గాజులరామారంలోని శ్రీనల్లపోచమ్మ రేణుకాఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. భూమిపూజ అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అద్దంకి దయాకర్, భూపతిరెడ్డిలను సత్కరించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సదానందం, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్‌రెడ్డి, ఫిషెర్మన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోషి మహేశ్, మాజీవార్డ్ సభ్యుడు పరశురామ్‌గౌడ్, గూదే రాజశేకర్, బత్తుల చిరంజీవి, చింతకింది సురేశ్, కొంటు సుమన్, దుబాయి మల్లారెడ్డి, మిద్దెల సీతారామ్‌రెడ్డి, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: మనస్తాపంతో ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా గుల్‌గుంట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన మహేష్‌కుమార్(24), లవకుమారి 2022 ఫిబ్రవరిలో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం బ్రతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లో ఉంటున్నారు. మహేష్‌కుమార్ గాంధీనగర్‌లోని ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా మహేష్ తల్లిదండ్రులకు మెట్కానిగూడలో ఇల్లు ఉండటంతో వారు అప్పుడప్పుడు వచ్చి ఇక్కడ ఉండి వెళ్తుంటారు. ఈ క్రమంలో 10రోజుల క్రితం మహేష్ తల్లిదండ్రులు ఇక్కడకు వచ్చారు. తరచూ మహేష్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వచ్చేవాడు.

◆ ఈ క్రమంలో శనివారం మహేష్ భార్య వద్దకు వచ్చి లవకుమారి వద్ద నుంచి బంగారు కమ్మలు తీసుకుని వెళ్లిపోయాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. శనివారం రాత్రి 11గంటలకు మహేష్ తండ్రి లవకుమారికి కాల్‌చేసి నీ భర్త విషం సేవించాడని నోటి నుంచి నురగ వస్తుందని తెలిపాడు. దీంతో లవకుమారి మల్లారెడ్డి ఆస్పత్రికి వెళ్లగా మహేష్ అప్పటికే మహేష్‌కుమార్ మృతిచెందినట్లు డ్యూటీ డాక్టర్ తెలిపాడు. కాగా లవకుమారి ఫిర్యాదులో అత్త,మామలు నా దగ్గరి నుంచి కట్నం కింద డబ్బు తీసుకురావాలని తరచూ వేధించే వారని పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి 8 నెలల కుమారడు ఉన్నాడు.

బండరాయితో మోది వ్యక్తి హత్య

దుండిగల్: గుర్తు తెలియని వ్యక్తులు తలపై బండరాయితో మోది ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన మనోజ్ చౌహాన్(35)తన భార్య లక్ష్మి చౌహాన్, కుమారులు మహేశ్, అన్నులతో కలిసి భౌరంపేట్‌లో సంవత్సరం కాలంగా నివసిస్తున్నారు. ఆరు సంవత్సరాల క్రితం పఠన్‌చెర్వులో మనోజ్ లక్ష్మిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వృత్తి రీత్యా మనోజ్ టైల్స్ కంపెనీలో పాలీష్ వర్కు చేస్తాడు కొంత కాలంగా భార్య,భర్తల మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి సైతం లక్ష్మి ఫోన్ మాట్లాడుతున్న విషయంపై ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఆదివారం ఉదయం చూసే సరికి మనోజ్ రక్తం మడుగులో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ హత్య వెనుక భార్య లక్ష్మి ప్రమేయం ఏమైన ఉందా? అనే కోణంలో సైతం పోలీసులు దార్యప్తు ముమ్మరం చేశారు.



మనోజ్ చౌహాన్ (ఫైల్)



రక్తం మడుగులో మనోజ్ చౌహాన్ మృతదేహం

చైన్ స్నాచర్ అరెస్టు

బంగారు గొలుసు స్వాధీనం

కేపీహెచ్‌బీకాలనీ: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకొని పారిపోయిన ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు 39 గ్రాముల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. శుక్రవారం నిజాంపేట రోడ్డు ప్రాంతంలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉండే శంకబాతుల మహాలక్ష్మి (56) భర్త, కొడుకు డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఉదయం 11.30 గంటల సమయంలో అదే కాలనీలో నివాసం ఉండే ఎం. కోటేశ్వరరావు (24) మహాలక్ష్మి ఇంటికి వెళ్లి తలుపు కొట్టడంతో గడియతీసింది. వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకునేందుకు యత్నించగా ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది.

◆ దీంతో ఆమె కళ్లలోకి గుర్తు తెలియని పౌడర్‌ను చల్లిన వెంకటేశ్వరావు బంగారు గొలుసును తెంచుకొని బయట గడియపెట్టి పారిపోయాడు. స్థానికుల సహకారంతో మహాలక్ష్మి కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి పుస్తెలతాడును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన ఒక్కరోజులోనే నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ చూపిన బాలానగర్ సీసీఎస్ పోలీసులు, కేపీహెచ్‌బీ క్రైమ్ విభాగం సిబ్బందిని సైబరాబాద్ ఉన్నతాధికారులు అభినందించారు. విలేకరుల సమావేశంలో కేపీహెచ్‌బీ సీఐ కిషన్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా సైక్లథాన్

మాదాపూర్: ఫిట్‌నెస్‌పై చిన్నారులకు, పెద్దలకు అవగాహన కల్పించడం ముఖ్యమని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్ వద్ద ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా 10కిలోమీటర్ల సైక్లోథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలి స్టేడియం నుండి ఇనార్బిట్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీసీపీ శిల్పవల్లి తెలంగాణ క్రీడాభివృద్ధి సంస్థ అధ్యక్షులు డాక్టర్ అంజనేయగౌడ్ నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఆస్ట్రోనిక్స్ సీఈఓ మేఘనాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించే దిశగా పనిచేస్తున్నాం

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్, గణేష్ హౌసింగ్ సొసైటీ కాలనీల్లో ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణనగర్‌లో కొత్త డ్రైనేజీ లైన్, సీసీ రోడ్డు, మంజీర పైపులైన్, గణేష్ హౌసింగ్ కాలనీలో రోడ్డును వెడల్పు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు 3వ ఫేజ్ లైన్‌ను మంజూరు చేయించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే ఉన్న అధికారులను వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. డీఈఈ భాను చందర్, ఏఈ సురేందర్ నాయక్, మేనేజర్ అనూష, కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు వీరం శెట్టి, హనుమంత్, నవీన్ కుమార్, ప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఆలయ పునర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

◆ గాజులరామారంలో శ్రీ నల్లపోచమ్మ రేణుకా ఎల్లమ్మ దేవస్థాన పునర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆలయాల అభివృద్ధిలో ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు.

స్క్రాప్ విక్రయాలపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి

బాలానగర్: బాలానగర్ పారిశ్రామిక వాడలోని ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్ లిమిటెడ్ (ఐడీపీఎల్) మందుల పరిశ్రమలోని స్క్రాప్ విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీఐటీయూ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అక్రమ విక్రయాలలో కేంద్ర ప్రభుత్వ అధికార పార్టీ పెద్దల హస్తం ఉన్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులను, ప్రజలను ఐక్యం చేసి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

19 నుంచి అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



మేయర్ నీలారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు

నిజాంపేట్: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు 7వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌తో కలిసి కలిసి ఆలయ కమిటీ సభ్యులు మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కోలన్ చంద్రశేఖర్‌రెడ్డి, గురుస్వామి ఇంద్రకుమార్‌దేవ్, ఆలయ కోశాధికారి శ్రీనివాస్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరిబాబు, జాయింట్ సెక్రటరీ సతీశ్ తదితరులు ఉన్నారు.

ఫుట్‌పాత్‌లు ఇలా.. నడిచేదెలా..?

నిర్మించిన కొన్నాళ్లకే ధ్వంసమవుతున్న ఫుట్‌పాత్‌లు



చింతల్ షాథియేటర్ వద్ద

రంగారెడ్డినగర్: పాదచారులకు సురక్షితమైన నడకదారిని వసతిని కల్పించేందుకు ప్రధాన రహదారులకు ఇరువైపులా నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు కొద్ది కాలానికే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్ నుంచి హెచ్ఎంటీ మీదుగా ఐడీపీఎల్ చౌరస్తా వరకు వేసిన ఫుత్‌పాత్ నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. కొన్ని ప్రాంతాల్లో కొద్ది మేర ఫుట్‌పాత్ టైల్స్ వేసి ఆపై వదిలేసినా అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు. ఇలా కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా ప్రాంతం నుంచి షాపూర్‌నగర్ చౌరస్తా వరకు ఉన్న ఫుట్‌పాత్‌లను అక్కడక్కడా వేయకుండా కాంట్రాక్టర్ వదిలేశాడు. అయితే వీటిపై పర్యవేక్షణ కొరవడిన అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు సైతం చెల్లించారు.



చింతల్ ప్రధాన రహదారిలోని హ్యాపీ చిల్డ్రన్స్ వద్ద

చింతల్ ప్రధాన రోడ్డు వెంబడి ఫుట్‌పాత్ ధ్వంసం..

చింతల్ ప్రధాన రోడ్డు వెంబడి హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి మొదలుకుని ఐడీపీఎల్ చౌరస్తా వరకు ఉన్న ఫుట్‌పాత్ అక్కడక్కడా ధ్వంసమైంది. నిర్మాణ సమయంలో సమపాళ్లలో ఇసుక, సిమెంట్ వాడకపోవడంతో పాటు ఫుట్‌పాత్‌పై కాంక్రీట్ వేసిన తరువాత సరిగా క్యూరింగ్ చేయకుండా టైల్స్‌ను వేశారు. అంతేకాకుండా టైల్స్ సైతం నాసిరకంగా ఉండటంతో కొద్ది రోజులకే ధ్వంసమయ్యాయి.



కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో

పలు ప్రాంతాల్లో కానరాని ఫుట్‌పాత్..

నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని బాలానగర్‌కు వెళ్లే రహదారిలో చింతల్ షా థియేటర్, గణేష్‌నగర్ బస్టాప్ నుంచి ఐడీపీఎల్ వరకు ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్ట లేదు. దీంతో పాదాచారులు రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది.

నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

- 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో క్రీడలు
- జిల్లాస్థాయిలో 22 నుంచి 24 వరకు పోటీలు
- కలెక్టర్ చైర్మన్‌గా జిల్లాస్థాయిలో క్రీడల కమిటీ
- ఎంపీపీ చైర్మన్‌గా మండల స్థాయిలో కమిటీలు

సాక్షి, మేడ్చల్‌జిల్లా : తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సీఎం కప్ పేరుతో మండల స్థాయి, జిల్లాస్థాయిలో క్రీడలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. క్రీడల నిర్వహణ, విజయవంతం చేసేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అమయ్‌కుమార్ చైర్మన్‌గా జిల్లాస్థాయి క్రీడల కమిటీ ఏర్పాటైంది. అలాగే, మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్‌గా మండల స్థాయి క్రీడల కమిటీలను ఏర్పాటు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 5 మండలాల్లోనే క్రీడలు నిర్వహిస్తారు. ప్రతీ మండలంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది.

మండల స్థాయిలో నేటి నుంచి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, మూడుచింతలపల్లి మండల కేంద్రాల్లో సోమవారం నుంచి 17 వరకు నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల స్థాయిలో అథ్లెటిక్స్(మహిళలు/పురుషులు), ఫుట్‌బాల్ (పురుషులు), కబడ్డీ (మహిళలు/ పురుషులు), ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రీడలను విజయవంతం చేసేందుకు మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల్లో ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీఓ కన్వీనర్‌గా ఉంటారు. సభ్యులుగా జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ/గజిటెడ్ హెడ్‌మాస్టర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఫిజికల్ డైరెక్టర్/పీఈటీలు ఉంటారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేస్తారు. ఈ క్రీడా పోటీల్లో 15 నుంచి 36 సంవత్సరాలు వయస్సు ఉన్న పురుషులు/ మహిళలు పాల్గొనాల్సి ఉంటుంది. మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి మండలానికి రూ.15 వేలు కేటాయించారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారుల జాబితాను సంబంధిత కమిటీలు ఈ నెల 18 వరకు జిల్లా యువజన, క్రీడలశాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని ఆ శాఖ అధికారి బి.బలరామారావు తెలిపారు.

ఈనెల 22 నుంచి జిల్లాస్థాయి క్రీడలు

మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈ నెల 22 నుంచి 24 వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా స్థాయి క్రీడా పోటీలు 11 విభాగాల్లో నిర్వహించనున్నారు. పోటీలను హకీంపేట్‌లోని తెలంగాణ స్పోర్ట్ స్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తారు. పాల్గొన్న క్రీడాకారులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 29 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.75 వేలు, మూడవ విజేతకు రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడాంశంలో మొదటి విజేతకు రూ.20వేలు, రెండవ విజేతకు రూ.15 వేలు, మూడవ విజేతకు రూ.10 వేలు సీఎం కప్‌తోపాటుగా అందజేస్తారు.జిల్లాస్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వయస్సు ధృవీకరణ పత్రం లేదా 10వ తరగతి మెమో, ఆధార్ కార్డును తప్పని సరిగా అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని జిల్లా యువజన, క్రీడలశాఖ పేర్కొంది.